క్లుప్తంగా

నీళ్ల ట్యాంకుల క్లోరినేషన్



వాటర్ ట్యాంకును పరిశుభ్రంగా కడిగి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

నందికొట్కూరు: పట్టణ ప్రజలను రోగాల బారి నుంచి కాపాడేందుకు మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయించినట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని బైరెడ్డి నగర్, కోట వీధి అల్లూరు రోడ్డు ఏరియాలో ఉన్న మంచినీటి వాటర్ ట్యాంకులను శుభ్రంగా మున్సిపల్ సిబ్బంది కడిగేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నీరు కలుషితమై ప్రజలు విష జ్వరాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీంతో ముందు జాగ్రత్తలు తీసుకుంటునట్లు చెప్పారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు



ఎస్ఎస్ఆర్ నగర్‌లో వేలాడుతున్న తీగలను చూపుతున్న కాలనీ వాసులు

నందికొట్కూరు: పట్టణంలోని వీధులల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్న ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ఆర్ నగర్‌లో ప్రజలతో కలిసి వేలాడుతదున్న విద్యుత్ తీగలను విలేకరులకు చూపించారు. ఆయన మాట్లాడుతూ వేలాడుతున్న విద్యుత్ తీగల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అధికారులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. అనేక సార్లు విద్యుత్ శాఖ అధికారులు తెలియజేసిన చర్యలు తీసుకోలేదని చెప్పారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం



కాలిపోతున్న గుడిసె

మహానంది: బుక్కాపురం రైస్ మిల్ సమీపంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్ నారాయణకు చెందిన గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ గాలి తీవ్రంగా ఉండటంతో మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు నంద్యాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం చేరవేశారు. సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. బియ్యం బస్తాలు, దుస్తులు, రూ.పది వేల నగదు కాలిపోయిందని, సుమారు రూ. 50వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు



పార్నపల్లె వద్ద పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

మహానంది: బండిఆత్మకూరు మండలంలో ఆదివారం సాయంత్రం భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండలంలోని పార్నపల్లె వద్ద ఇన్సులేటర్ ఫెయిలవడంతో సరఫరా నిలిచిపోయింది. స్పందించిన ఏఈ ప్రసాద్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. దీంతో గంట తర్వాత సరఫరా వచ్చినట్లు ప్రజలు తెలిపారు. వర్షంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నీటి సమస్యకు పరిష్కారం



ఏ.కోడూరులో లీకేజీ పనులు చేస్తున్న కూలీలు

మహానంది: ఏ.కోడూరు గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ మన్నె జ్ఞానాభరణం తెలిపారు. ఆదివారం గ్రామంలో మంచినీటి పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేపట్టారు. గ్రామంలోని సుంకులమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో ఉన్న లీకేజీ పనులను పూర్తి చేయించినట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రైతన్నకు రాయితీలు



ఆత్మకూరు ఆర్బీకేలో ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న అధికారులు



ఆత్మకూరు వద్ద ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతున్న రైతు

- ముందస్తు ఖరీఫ్ సాగుకు సిద్ధమైన అన్నదాతలు
- సబ్సిడీపై జీలుగ విత్తనాలు, త్వరలో కందులు, పెసలు
- ఇప్పటికే ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్న ఎరువులు

ఆత్మకూరు: ఇటీవల కురిసిన వర్షాలకు అన్నదాతలు వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు. ముందస్తు ఖరీఫ్‌కు సిద్ధమైన రైతన్నలకు ప్రభుత్వం రాయితీపై ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచింది. వర్షాలకు భూములు పదునవ్వడంతో జూన్ మొదటి వారంలో విత్తులు వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతుండగా.. ఇందుకు అనుగుణంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

సాగు విస్తీర్ణం ఇలా..

ఆత్మకూరు మండలంలో ఖరీఫ్ సాగు 7,960 హెక్టార్లు, వెలుగోడు మండలంలో 4,768 హెక్టార్లు, పాములపాడు మండలంలో 6,293, కొత్తపల్లి 7961 హెక్టార్లలో పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం డివిజన్‌లో అత్యధికంగా మొక్కజొన్న, మెట్ట వరి పంటలతో పాటు కంది, పెసర, పత్తి, ఎండుమిర్చి పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ఇప్పటికే ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న ఎరువులు

ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లోని ఆర్‌బీకేల్లో ఇప్పటికే ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. గతేడాది రబీలో మిగిలిన ఎరువులతోపాటు ఈ ఏడాది ఖరీఫ్ ఎంత మేరకు ఎరువులు అవసరమవుతాయో అంత మొత్తంలో డివిజన్‌లోని నాలుగు మండలాలలోని 61 రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

డివిజన్‌లోని నాలుగు మండలాల్లోని అన్నదాతలు పొలాల్లో భూసారం పెంపొందించుకునేందుకు జీలుగ విత్తనాలను వ్యవసాయాధికారులు రాయితీపై పంపిణీ చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని ఆత్మకూరులో 50 క్వింటాళ్లు, వెలుగోడు మండలంలో 70 క్వింటాళ్లు, పాములపాడు మండలంలో 100 క్వింటాళ్లు, కొత్తపల్లి మండలంలో 60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను రైతులకు అందించేందుకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచారు. 100 కిలోల జీలుగ విత్తనాలు రూ.880 చొప్పున ధర ఉండగా రైతులకు 50 శాతం సబ్సిడీపై రూ.440కి అందించనున్నారు. రైతులు జీలుగ విత్తనాలను ప్రస్తుత వర్షాలకు విత్తుకునేందుకు అనువుగా ఉంది. త్వరలో కందులు, పెసలు కూడా పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

సబ్సిడీపై జీలుగల పంపిణీ



ప్రస్తుతం రైతులకు జీలుగ విత్తనాలను సబ్సిడీలో అందిస్తున్నాం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసి పొలంలో విత్తుకొని సాగుచేస్తే భూసారం పెరుగుతుంది. జీలుగ విత్తు వేసేందుకు ఇది అనువైన సమయం. అలాగే రైతులకు త్వరలోనే కందులు, మినుము విత్తనాలను కూడా సబ్సిడీపై అందిస్తాం. ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయి. – **విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఆత్మకూరు**

రేపటి నుంచి శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయ రాజ గోపురం



శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

మిడుతూరు: మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఏడీ వెంకటరమణ ఆదివారం తెలిపారు. 21న ఉదయం 5.20 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం, 8 గంటలకు శేషవాహనం, రాత్రి 7.30 గంటలకు హనుమత్ ఉత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. 22న వైశాఖ శుద్ధ చతుర్దశి బుధవారం ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7.30 గంటలకు గరుడోత్సవం, 23న ఉదయం రథాంగహోమం, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గటంలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్ల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 24న ఉదయం తీర్థావళి, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గంటలకు పారువేట మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయలని కోరారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్గనైజర్స్ గోపాల కృష్ణ, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస నాయక్, శ్రీనాథ్‌రెడ్డి, రసూల్ బాషా, బాల వెంకటరమణ, నాగరంగస్వామి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 1997 నుంచి 2002 సంవత్సరం వరకు చదువుకున్న విద్యార్థులు కుటుంబాలతో తరలి వచ్చి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. వారి భవిష్యత్తుకు బాటలు వేసిన గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శరబయ్య, దాశరధి, మగ్బుల్, శేషిరెడ్డి, డేనియల్, ఉదయ్‌భాస్కర్, రామచంద్రుడు, రామ్ ప్రసాద్, ఖాదర్‌వలి, పాల్ ప్రసాద రావు, అయూబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వవిద్యార్థులు

ఎన్నికల కోడ్ ముగిసే వరకూ 144 సెక్షన్



మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మినారాయణ

జూపాడుబంగ్లా: సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసే వరకూ మండలం వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 144 సీ.ఆర్.పీ.సీ సెక్షన్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎవరూ గుంపులు గుంపులుగా ఉండరాదని ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెట్రోల్ బంకుల యజమానులతో పాటు గ్రామాల్లోని పెట్రోల్ బంకుల నిర్వాహకులు సీసాలు, బాటిళ్లలో పెట్రోల్ విక్రయించినట్లు తెలిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. డీజే వాహనాల నిర్వహణకు అనుమతుల్లేనందున డీజే వాహన దారులు వాహనాలను ఎక్కడికీ పంపరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలను నిర్వహిస్తే వాహనాలను సీజ్ చేయటంతో పాటు యజమానులపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అలాగే దుకాణాల్లో బాణసంచా అమ్మినా, వాటిని గ్రామాల్లో పేల్చినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. వీటితో పాటు ఎన్నికల కౌంటింగ్ రోజైన జూన్ 4న గ్రామాల్లోని ప్రజలు ఎవరూ కౌంటింగ్ కేంద్రాల వద్దకు వెళ్లరాదని సూచించారు.

బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ విక్రయించొద్దు

ఆత్మకూరు: ఖాళీ బాటిళ్లల్లో పెట్రోల్, డీజిల్ విక్రయించొద్దని పట్టణ సీఐ లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.పట్టణంలోని అన్ని పెట్రోల్ బంకుల యజమానులు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బంకులకు వచ్చే వారి వాహనాల్లో మాత్రమే పెట్రోల్ నింపాలన్నారు. ఖాళీ బాటిళ్లలో నింపాలని కోరితే తిరస్కరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక సాయం

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామానికి చెందిన బోయరామకృష్ణ(38) అనే వ్యక్తి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు మృతుని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని మృతుని భార్య హరితకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎల్లారెడ్డి, నూనెపల్లె నాగిరెడ్డి, రమణారెడ్డి, తెలుగుసాంబ, వడ్డెశంకర్, అంజి, రాజేష్, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మహానంది



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: వరుస సెలవులు, ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులతో మహానంది క్షేత్రం కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు ముందుగా రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి,మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. వారం రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతుండటంతో దేవస్థానానికి చెందిన వసతి గృహాలు నిండిపోవడంతో ప్రైవేటు లాడ్జీలకు డిమాండ్ నెలకొంది. లాడ్జీల నిర్వాహకులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీసు, దేవదాయశాఖ అధికారులు స్పందించి నిర్ణీత ధరలు ఏర్పాటు చేసి లాడ్జీల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



విజిట్ పుస్తకాల్లో సంతకాలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

పాణ్యం: స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను ఆదివారం జిల్లా కలెక్టర్, ఎస్పీ తనిఖీ చేశారు. రూమ్‌ల తలుపులకు వేసిన తాళాలు, వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. అన్ని రూమ్‌ల వద్ద ఉన్న ససీఈ కెమెరాల కనెక్షన్‌తో వెబ్ కాస్టింగ్ దృశ్యాలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించారు. భద్రతా సిబ్బందికి వారు సూచనలు చేశారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్‌రూమ్‌ల వద్దు ఎట్టి పరిస్థితిల్లోనూ రానివ్వద్దని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా హింసాత్మకమైన చర్యలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమాజాభివృద్ధికి విద్య ఎంతో అవసరం



చాగలమర్రి మక్తబ్ జామియా మస్జీద్‌లో ఖురాన్ ప్రశస్త్యాన్ని వివరిస్తున్న విద్యార్థులు



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, గ్రామస్తులు

చాగలమర్రి: సమాజాభివృద్ధికి విద్య ఎంతో అవసరమని నెల్లూరు పట్టణానికి చెందిన ఇస్లాం మత పెద్దలు మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ రషాదీ ఖాస్మీ అన్నారు. ఆదివారం స్థానిక జామియా మస్జీద్‌లో నిర్వహించిన అరబ్బీ మదరాసా వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మక్‌తబ్ జామియా మదరసా నిర్వాహకులు, జామియా మస్జీద్ ఇమాం హాఫీజ్ సులేమాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఖురాన్ ప్రవచనాలు, ఇస్లాం పద్ధతులు, ప్రవక్త జీవితం, ఇస్లాం మత వ్యాప్తికి ఏ విధంగా పాటు పడ్డాడు అనే అంశాలపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన, గ్రూప్ డిస్కషన్ పోటీలు నిర్వహించి గెలుపొదిన 40 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మౌలానా ముఫ్తీ అబ్దుల్ హాది సాహెబ్, మిస్తాహి వ ఖాస్మీ, మౌలానా ముఫ్తీ ఖలీలుల్ రెహమాన్ సాహెబ్ వ మిఫ్తాహి ఓ ఖాస్మీ, మౌలానా అబ్దుల్ మజీద్ సాహెబ్ బాఖవీ, స్థానిక మౌళ్వీలు ఖలీల్, అబ్దుల్ సలాం, మేహబుబ్, గౌస్, అబ్దుల్ సుబహాన్ పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలు కొనసాగిద్దాం



సింగరాజుపల్లె లో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.స్వాములు, మండల నాయ కులు ఎస్ సంజీవరాయుడు, కేవీపీఎస్ జిల్లా నాయకులు ఎన్ సంపత్ అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండలంలోని సింగరాజుపల్లి, చిన్న గుమ్మడాపురం, శివపురం గ్రామాల్లో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుమ్మడాపురం గ్రామ సర్పంచ్ నక్క విజయకుమార్, సీపీఎం ప్రజాసంఘాల నాయకులు ఎన్ దాసు దేవకుమార్, ఎన్ గోపాల్, ఎం జ్ఞాన సూర్యుడు, సంసోన్, జి దాసు, వి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు రాజశేఖర్, రణధీర్ పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య వర్ధంతిని పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంజుల, ఎ.సురేంద్ర, ఎన్.స్వాములు, పి.సుధాకర్, మాబాషా, బి.ఎస్.వలి, ప్రభావతి పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు



బహుమతులు ప్రదానం చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఎద్దులు బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి వీరబ్రహ్మేంద్రస్వాముల ఆరాధనోత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన పాలపళ్ల విభాగం ఎద్దుల పోటీలను మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తనయుడు శ్రీరెడ్డి భరత్‌రెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ కడప జిల్లా, దాసేపల్లెకు చెందిన మొలకల చిన్న వీరన్నయాదవ్ వృషభాలు నిర్ణీత సమయానికి 6,168 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలువగా, దాతలు రూ.50 వేలను ప్రదానం చేశారు. అనంతపురం జిల్లా, పుల్లేటిపల్లె బచ్చల భాస్కర్‌రెడ్డి వృషభాలు 6,163 అడుగులులాగి రెండవ బహుమతి రూ.40 వేలను దక్కించుకున్నాయి. అలాగే వైఎస్సార్ జిల్లా, సి.కొత్తపల్లెకు చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి వృసభాలు 6,075 అడుగులు లాగి మూడవ బహుమతి రూ.30 వేలను కైవసం చేసుకున్నాయి. అనంతపురం జిల్లా, కోసూరు మండలం, పల్నాడుకు చెందిన గోపిరెడ్డి వెంకటరెడ్డి వృషభాలు 6,000 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.20 వేలను దక్కించుకోగా, సూర్యపేట జిల్లా, కోదాడ మండలం, రామలక్ష్మిపురం వాస్తవ్యులు కేఎస్ రెడ్డి, నంది ట్రేడింగ్ బుల్స్ 5,909 అడుగులు లాగి ఐదవ బహుమతి రూ.15 వేలు, కర్నూలు జిల్లా, బి.తాండ్రపాడు, పీఆర్‌పల్లెకు చెందిన చిన్నరత్నం, రంగనాయకులు(విడిజత) వృషభాలు ఆరవ బహుమతి రూ.10 వేలను కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు వాడాల రామనాయుడు, అబ్దుల్ కలాం వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సచివాలయ కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు మనోహరప్ప, ఎర్రన్న యాదవ్, రమేష్‌నాయుడు, కృష్ణయ్య యాదవ్, వడ్డె మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీదేవిని పరామర్శిస్తున్న శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబాన్ని శాప్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, నాగంపల్లి సొసైటీ చైర్మన్ బలసాని రామలింగారెడ్డి భార్య లక్ష్మీదేవి కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, మండల కోఆప్టేట్ మెంబర్ మహమ్మద్ గౌస్, శివపురం ఎంపీటీసీ శివన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, కొక్కెరంచ సర్పంచు విష్ణువర్ధన్ రెడ్డి, గోకవరం సర్పంచ్ కలబండిమారన్న, నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు మాహబూబ్ బాషా, నాయకులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



గ్రామాల్లో పర్యటిస్తున్న సీఐ, పోలీసు సిబ్బంది

మహానంది: జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడి చట్టాన్ని అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదని నంద్యాల రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో ఎస్సైలు మల్లికార్జున, నాగార్జున రెడ్డితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా వ్యక్తిగత కక్షలతో గొడవలకు దిగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

నాటుకోడి అ‘ధర’హో

- భారీగా పెరిగిన ధరలు
- జిల్లాలో 44 లక్షలకు పైగా నాటుకోళ్లు
- కిలో రూ.800 ప్రకారం విక్రయం
- అమాంతం పెరిగిన గుడ్ల రేటు



నంద్యాల(అర్బన్): సాధారణంగా దసరా, సంక్రాంతి పండగకు నాటు కోడి ధర పెరుగుతుండేది. ప్రస్తుతం నాటుకోడి డిమాండ్ ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో వాటి పెంపకం అధికమైంది. నాటుకోడి లైవ్ ధర రూ.550 పలుకుతుండగా కిలో మాంసం రూ.750 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు.

కరోనా లాక్ డౌన్ నుంచి..

కరోనా లాక్‌డౌన్ ఏర్పడిన నాటి నుంచి నాటుకోడి మాంసం, గుడ్లపై ప్రజలు దృష్టి సారించారు. వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటే కరోనా రాదని నిపుణులు తెలియజేయడంతో పాటు మాంసం, గుడ్లు, చేపలు తీసుకోవాలని సూచించారు. దీంతో ప్రజలు నాటుకోడి, గుడ్లు, పొట్టేళ్ల మాంసం వైపు మళ్లారు. గతంలో పొట్టేలు మాంసం రూ.700 ఉండగా ప్రస్తుతం రూ.800 నుంచి రూ.850 మధ్య విక్రయాలు సాగుతున్నాయి. గతంలో కిలో నాటు కోడి లైవ్ మాంసం ధర రూ.500 ఉండేది. ఇప్పుడు రూ.600కు చేరింది. మామూలు నాటుకోడి ధర కిలో రూ.700 నుంచి రూ.750 మధ్యలో అమ్ముతున్నారు. నాటు కోడి గుడ్లు లభించడం గగనమైంది. ప్రస్తుతం నాటు కోడిగుడ్డు ఒకటి రూ.10 పలుకుతుంది. నాటుకోళ్లు నాలుగు నుంచి ఆరు నెలల వ్యవధిలో పెరుగుదలకు వచ్చి విక్రయాలకు అనువుగా మారుతాయి. నాటుకోడి పెంపకాన్ని పల్లెల్లో ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు.

కల్తీ మాంసం విక్రయాలు..

పట్టణ ప్రాంతాల్లో పలు చికెన్ సెంటర్ల వద్ద బ్రాయిలర్‌తో పాటు నాటుకోడి మాంసం విక్రయాల బోర్డులు దర్శనమిస్తున్నాయి. కిలో నాటుకోడి మాంసం రూ.700 నుంచి రూ.750 ప్రకారం విక్రయిస్తున్నాయి. అయితే కొందరు నాటు కోడి మాంసంలో బ్రాయిలర్ కోడి మాంసం కలిపేయడం, మరికొన్ని చోట్ల క్రాస్ నాటుకోడి మాంసం కలిపి అమ్ముతూ మోసాలకు పాల్పడుతున్నారు. కల్తీ బారి నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు పల్లెల బాట పడుతున్నారు.

నాటుకోళ్ల పెంపకంతో ఉపాధి



చిన్న కుటీరంలో నాటుకోళ్ల పెంపకాన్ని సాగిస్తున్నా. నా వద్ద దాదాపు 120 కోళ్లు ఉన్నాయి. అందులో 60 శాతం పెట్ట కోళ్లు ఉన్నాయి. రోజుకు 55 గుడ్లు పెడతాయి. గుడ్లను అమ్మకాలకు పెట్టకుండా పొదిగిస్తూ పిల్లల పెంపకం చేపడుతున్నాం. నాటుకోళ్ల పంపెకంతో తమ కుటుంబానికి ఉపాధి దొరుకుతుంది. కోళ్లకు పెట్టే దాణాతో ఒక్కో కోడి 6 నుంచి 8కేజీల వరకు తూకం వస్తాయి. 6కేజీల కోడి రూ.4వేల నుంచి రూ.5వేల వరకు అమ్ముతున్నాం. – రమేష్, నాటుకోళ్ల పెంపకం దారుడు, నంద్యాల.